ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 12 ఏప్రిల్ 2024

అన్ని జిల్లాలకు

పారా మిలిటరీ దళాలు



ప్యారీస్, ఏప్రిల్ 11: రాష్ట్రవ్యాప్తంగా అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల బందోబస్తు కోసం పారా మిలిటరీ దళాలను పంపిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఈ నెల 19న సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో, సమస్యాత్మక ప్రాంతాల్లో స్థానిక పోలీసులతో కలసి పారా మిలిటరీ దళాలను కూడా బందోబస్తు కోసం వినియోగించుకోనేందుకు ఈసీ నిర్ణయించింది. ఇందులో చెన్నై, మదురై జిల్లాలకు మాత్రం తలా 7 కంపెనీల పారా మిలిటరీ దళాలను పంపించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 39 పార్లమెంటు నియోజకవర్గాల్లో నిర్వహించనున్న ఎన్నికల బందోబస్తుకు 190 కంపెనీల పారా మిలిటరీ బలగాలను వినియోగించనున్నారు. తిరుప్పూర్ జిల్లాకు 3, తిరుచ్చి, సేలం జిల్లాలకు 4, తిరునల్వేలి జిల్లాకు 3, ఆవడి, తాంబరం ప్రాంతాలకు తలా ఒక పారా మిలిటరీ దళాలు ఇప్పటికే చేరాయని తెలిపారు. అరియలూరుకు 2, చెంగల్పట్టు 3, కోయంబత్తూర్‌కు 7, కడలూరుకు 5, ధర్మపురి 4, దిండుగల్ 4, ఈరోడ్ 4, కళ్లకుర్చి 3, కాంచీపురం 5, కన్నియాకుమారి 6, కృష్ణగిరి 4, మదురై 4, మైలాడుదురై 2, నాగపట్టణం 2, నామక్కల్ 3, పెరంబలూరు 3, పుదుకోట 3, రామనాథపురం 4, రాణిపేట 3, సేలం 5, శివగంగ 4, తెన్‌కాశి 3, తంజావూరు 6, నీలగిరి 2, తూత్తుకుడి 6, తిరుచ్చి 3, తిరుపత్తూర్ 4, తిరుప్పూర్ 5, తిరునల్వేలి 5, తిరువళ్లూర్ 4, తిరువణ్ణామలై 5, తిరువారూర్ 3, వేలూరు 5, విరుదునగర్ 5, విల్లుపురం 5 కంపెనీల చొప్పున పారా మిలిటరీ బలగాలతో పాటు స్థానిక పోలీసులు, హోంగార్డులు, మాజీ సైనికులు కూడా ఎన్నికల భద్రతలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

ఈద్ ముబారక్





పరస్పరం ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటున్న బాలికలు - రంజాన్ సామూహిక ప్రార్థన

నగరంలో రంజాన్ సందర్భంగా గురువారం మసీదుల్లో ప్రార్థనలు జరిగాయి. చిన్నారులు, పెద్దలు పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎన్నికల ప్రచారంలో

వినూత్నం

● అన్నాడీఎంకే 'రోబో' అస్త్రం

ప్యారీస్, ఏప్రిల్ 11: ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ఎన్నికల ప్రచారానికి 'రోబో'ను వినియోగించుకుంటూ సరికొత్త పంథాకు శ్రీకారం చుట్టింది. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, అన్ని రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని వేగవంతం చేశాయి. అధినేతలు, అభ్యర్థులతో కలసి రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొంటుండగా, ద్వితీయ శ్రేణి నాయకులు పార్టీ జెండాలతో అన్ని నియోజకవర్గాల్లో ఇంటింటా తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ప్రచారంలో అన్నాడీఎంకే యంత్రాన్ని కూడా విడిచిపెట్టలేదు. ధర్మపురి బస్టాండ్ ప్రాంగణంలో ఒక రోబో అక్కడికి వెళ్లే వారి వద్ద 'అన్నాడీఎంకే గుర్తు రెండాకులుపై ఓటు వేసి గెలిపించాలని' అభ్యర్థిస్తోంది. కోవైకి చెందిన శివప్రీతం అనే ఐటీ విద్యార్థి ఏఐ టెక్నాలజీతో ఈ రోబోను డిజైన్ చేశాడు. ఈ రోబో దగ్గరకు ఎవరు వెళ్లినా అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్, మాజీ ముఖ్యమంత్రులు జయలలిత, ఎడప్పాడి పళనిస్వామి చిత్రపటాలు, అన్నాడీఎంకే ప్రభుత్వంలో పరిచయం చేసిన పథకాలను పరిచయం చేసి ఓట్లు అభ్యర్థిస్తుంది. కొన్ని సమయాల్లో కొంతదూరం వరకు నడిచే విధంగా డిజైన్ చేసి ఈ రోబో అందర్నీ ఆకట్టుకుంటోంది.



రోబోను ఆసక్తిగా చూస్తున్న విద్యార్థులు

అన్నిరంగాల్లో రాష్ట్రం బెస్ట్

కేంద్రం కితాబు



చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతుల్లో, ప్రత్యేక ఆర్థిక మండళ్ల నిర్వహణలో, మాతా శిశు సంరక్షణలో రాష్ట్రం ముందంజలో ఉందని కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ కితాబిచ్చింది. భారతదేశంలోని ప్రతిరాష్ట్రంలోనూ పారిశ్రామిక సంబంధిత ఎగుమతులు, ఇంజనీరింగ్ సంబంధిత ఎగుమతులు, మాతా శిశు సంరక్షణ, కంప్యూటర్ వస్తువులు ఎగుమతుల, సెజ్‌ల నిర్వహణ అంటూ ఏడు విభాగాలలో ప్రగతి వివరాలను ప్రతియేటా ప్రకటించడం ఆనవాయితీ. ఆ మేరకు కేంద్ర నీతి ఆయోగ్ విడుదల చేసిన వివరాల్లో రాష్ట్రం నూటికి 80 కంటే అధికమైన పాయింట్లు సాధించి అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని ప్రకటించారు. దేశవ్యాప్తంగా జరిగిన ఎగుమతుల్లో 16.30 శాతం ఎగుమతులు తమిళనాడు నుండే జరుగుతున్నాయని ఎగుమతుల్లో మహారాష్ట్ర తర్వాతి స్థానం ఆ రాష్ట్రం సంపాదించుకుందని తెలిపారు. మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలను అమలు చేయడంలోనూ రాష్ట్రం ముందంజలో ఉందని, ప్రత్యేకించి బాలింతల సంరక్షణ విషయంలో రాష్ట్రం ప్రథమస్థానం సాధించిందని తెలిపారు. తమిళనాడులోనే ప్రసవాలకు అన్ని సదుపాయాలు కలిగిన ప్రభుత్వ ఆసుపత్రులున్నాయని, కనుక ఆ రాష్ట్రంలో 90 శాతానికి పైగా ప్రసవాలు సర్కారు దవాఖానాల్లోనే జరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ వివరాల్లో ప్రకటించారు. అదే విధంగా నవజాత శిశువుల సంరక్షణలోనూ తమిళనాడు అన్ని రాష్ట్రాలకంటే అత్యున్నత స్థానంలో ఉందని ప్రకటించారు. ఇక ప్రత్యేక పారిశ్రామిక మండళ్ల నిర్వహణలోనూ తమిళనాడు ప్రథమ స్థానంలో ఉందని, రాష్ట్రంలో అత్యధికంగా 50 సెజ్‌లనుసమర్థవంతంగా నిర్వహిస్తుండటమే కాకుండా ఆ సెజ్‌ల్లో స్వదేశీ, విదేశీ బహుళజాతి సంస్థలకు చెందిన పరిశ్రమలకు స్థానం కల్పించారంటూ నీతి అయోగ్ ప్రశంసించింది. ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్ సెజ్‌ల నిర్వహణలో ద్వితీయ స్థానంలో నిలిచిందని,, ఆ రాష్ట్రంలో 21 సెజ్‌లు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

ఇదే ద్రావిడ తరహా పాలన...

కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ వెల్లడించిన ఫలితాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పందిస్తూ రాష్ట్రంలో ద్రావిడతరహా పాలనకు లభించిన కితాబు ఇదేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని చెప్పటానికి కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన ఈ వివరాలే సాక్ష్యమని తెలిపారు. అంతటా అభివృద్ధి అందరికీ అభివృద్ధి అనే ప్రధాన లక్ష్యంతోనే రాష్ట్రంలో తమ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని స్టాలిన్ తెలిపారు.

అవినీతిపరులంతా జైలుకే!

అదే మోదీ గ్యారెంటీ!

బీజేపీ నేత అన్నామలై



చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుటుంబ పాలనను అంతమొందించి, అవినీతిపరులందరినీ జైలుకు తరలించడమే ప్రధాని మోదీ తమిళ ప్రజానీకానికి ఇస్తున్న ప్రత్యేక గ్యారెంటీ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై అన్నారు. గురువారం మధ్యాహ్నం ఆయన కోయంబత్తూరులో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్‌షో జరిపినంత మాత్రాన ఓట్లు పడవని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించడం గర్హనీయమన్నారు. దమ్ముంటే ఎడప్పాడి రోడ్‌షో జరపాలని డిమాండ్ చేశారు. బీజేపీ రోడ్‌షోలు ఓట్లు దండుకోవడం కోసం నిర్వహించడం లేదని, వాటిని ప్రజా సందర్శన యాత్రగానే భావిస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ఘనవిజయం సాధించి మోదీ మూడోసారి ప్రధాని అవుతారని, రాష్ట్రంలో కుటుంబ పాలను అంతమొందిస్తామని, టాస్మాక్ మత్తునుండి, మాదక ద్రవ్యాల బారి నుండి తమిళులందరినీ కాపాడుతామనే మోదీ గ్యారెంటీ ఇస్తున్నారని అన్నామలై చెప్పారు. రాష్ట్రంలో ద్రావిడ పార్టీలు బీజేపీని ఉత్తరాదికి చెందిన ప్రాంతీయ పార్టీగా దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

రోలెక్స్ అని పేరు పెడతారా?

రాష్ట్ర యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి ఇటీవల ఓ పసికందుకు 'రోలెక్స్' అనే పేరుపెట్టడం విడ్డూరంగా ఉందన్నామలై పేర్కొన్నారు. శిశువులకు అందమైన తమిళ పేర్లే పెట్టాలని శాసించే డీఎంకేకు చెందిన మంత్రి కమల్‌హాసన్ నటించిన విక్రమ్ సినిమాలో మాదకద్రవ్యాలా మాఫియా ముఠా నాయకుడి పేరు పెట్టడం సమంజసమేనా అని ప్రశ్నించారు. కొంగుమండలం తమ కంచుకోట అని డంబాలు పలికే డీఎంకేకి ఈ సారి ఆ మండలంలో ఘోర పరాభవం తప్పదన్నారు. జూన్ నాలుగు తర్వాత కొంగుమండలం ఏ పార్టీకి కంచుకోట అవుతుందో వేచి చూడాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి తాను కేంద్ర మంత్రివర్గంలో చేరాలని భావించడం లేదని, తన ప్రధాన దృష్టి అంతా 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని గెలిపించడమేనని అన్నామలై స్పష్టం చేశారు.

నేడు రాష్ట్రానికి అగ్రనేతలు

- కోవైకి రాహుల్, మధురైకి అమిత్‌షా
- 15న మళ్ళీ ప్రచారానికి మోదీ



రాహులగాంధీ - అమిత్‌షా - ప్రధాని మోదీ

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వం ముగియడానికి ఇక ఆరు రోజులే మిగిలి ఉండటంతో ప్రాంతీయ పార్టీల నేతలు, జాతీయ పార్టీల నేతలు పోటీ పడి ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఎన్డీయేకు మద్దతుగా ప్రధాని మోదీ ఇప్పటికే ఏడుసార్లు రాష్ట్రంలో పర్యటించారు. ఈ నెల 15న మళ్ళీ ప్రచారానికి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి తరపున ప్రచారం చేయడానికి ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శుక్రవారం రాష్ట్రానికి రానున్నారు. కోయంబత్తూరులో జరిగే సభలో రాహుల్‌తో పాటు డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా పాల్గొని ప్రసంగించనున్నారు. ఇక ఎన్డీయేకు మద్దతుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శుక్రవారం సాయంత్రం మదురై విచ్చేయనున్నారు.

కారైక్కుడి రోడ్‌షో మళ్ళీ రద్దు...

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కారైక్కుడిలో జరుపతలపెట్టిన రోడ్‌షో మళ్ళీ రద్దయ్యింది. శివగంగ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న కారైక్కుడిలో నాలుగు కిలోమీటర్ల వరకు రోడ్‌షో నిర్వహించేలా ఏర్పాట్లు చేపట్టారు. అయితే ఆ రోడ్‌షో రద్దయినట్లు బీజేపీ రాష్ట్ర శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. తాజా సమాచారం మేరకు అమిత్‌షా శుక్రవారం మధ్యాహ్నం 3.05 గంటలకు ప్రత్యేక విమానంలో మదురై చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో కారైక్కుడి వెళ్తారు. అక్కడి నుండి శివగంగ నియోజకవర్గం పరిధిలో ఉన్న పుదుకోట జిల్లా తిరుమయమ్ కోట్టై భైరవర్ ఆలయం, సత్యవాగీశ్వరాలయాన్ని సందర్శిస్తారు. ఈ కార్యక్రమాలను ముగించుకుని ఆయన సాయంత్రం ఆరుగంటలకు మదురై చేరుకుంటారు. బీజేపీ అభ్యర్థి రామ శ్రీనివాసన్‌కు మద్దతుగా రోడ్‌షోలో పాల్గొన్నారు. నేతాజీ రోడ్డు నుంచి ఝాన్సీరాణి పార్కు, నగల దుకాణం బజార్ మీదుగా విలక్కుతూన్ ప్రాంతం వరకు జరిగే వాహనాల ర్యాలీలో పాల్గొంటారు. రాత్రి 7.30 గంటలకు మదురై మీనాక్షి అమ్మవారిని దర్శించి రాత్రి అళగర్‌కోవిల్ రోడ్డులోని స్టార్ హోటల్‌లో బసచేస్తారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు మదురై నుండి బయలుదేరి హెలికాప్టర్‌లో తిరువనంతపురానికి వెళతారు. అక్కడినుంచి హెలికాప్టర్‌లో తక్కలై చేరుకుంటారు. ఉదయం 9.50 గంటలకు కన్నియాకుమారిలో పోటీ చేస్తున్న కేంద్ర మాజీమంత్రి పొన్ రాధాకృష్ణన్‌కు మద్దతుగాజరిగే వాహన ర్యాలీలో పాల్గొంటారు. తర్వాత మళ్ళీ ఆయన తిరువనంతపురానికి వెళ్ళి అక్కడి నుంచి హెలికాప్టర్‌లో తిరుచ్చి చేరుకుంటారు. తిరుచ్చిలో మధ్యాహ్న భోజనం ముగించుకుని హెలికాప్టర్‌లో తిరువారూరు వెళతారు. నాగపట్టినంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రచార సభలోపాల్గొని ప్రసంగిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి తిరుచ్చి చేరుకుని విమానంలో తూత్తుకుడి వెళతారు. అక్కడి నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి తెన్‌కాశి జిల్లా ఇలంజి చేరుకుని తెన్‌కాశి టౌన్ ప్రాంతం నుంచి కొత్త బస్‌స్టేషన్ వరకు రోడ్‌షోలో ఆయన పాల్గొంటారు.

రాహుల్ రోడ్‌షో...

ఇదిలా ఉండగా ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు తిరునల్వేలిలో జరిగే ప్రచార బహిరంగ సభలో పాల్గొన్నారు. హెలికాప్టర్‌లో సాయంత్రం నాలుగుగంటలకు తిరునల్వేలి చేరుకోనున్న రాహుల్ సభా వేదిక వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్‌షోలో పాల్గొంటారు. ఆ తర్వాత కన్నియాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, విరుదునగర్, రామనాథపురం, శివగంగ, మదురై లోక్‌సభ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థులకు, విలవంగోడు శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ఆయన ప్రచారం చేస్తారు. ఈ సభలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా పాల్గొంటారు.

ఇదిలా ఉండగా తిరునల్వేలిలో బీజేపీ నుంచి పోటీ చేస్తున్న నయినార్ నాగేంద్రన్‌కు మద్దతుగా ప్రచార సభలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 15న రానున్నారు. అగస్తీశ్వరపట్టి మైదానంలో ఏర్పాటవుతున్న బహిరంగ సభలో పాల్గొని ఆయన ప్రసంగించనున్నారు. మోదీ పర్యటన నేపథ్యలోఓ స్థానిక పోలీసులు, కేంద్ర పారిశ్రామిక భద్రతాదళం ఉన్నతాధికారులు, ప్రధాని ప్రత్యేక భద్రతాదళం అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ సభకు లక్షమందికిపైగా జనాన్ని తరలించేందుకు ఎన్డీయే మిత్రపక్షాల నాయకులు ప్రయత్నిస్తున్నారు.

రాష్ట్రంలో రెండు రోజులు మంత్రి నిర్మలా సీతారామన్ ప్రచారం



పెరంబూర్, ఏప్రిల్ 11: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం నుంచి రెండు రోజులు బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. రాష్ట్రంలోని 30 నియోజకవర్గాలకు ఈ నెల 19వ తేది జరుగున్న ఎన్నికలకు ఇంకా వారం రోజులు మాత్రమే సమయం ఉండడంతో అన్ని పార్టీలు ప్రచారం ముమ్మరం చేశాయి. బీజేపీ కూటమి అభ్యర్థుల తరఫున ప్రధాని నరేంద్ర మోదీ, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, తదితరులు ప్రచారం నిర్వహించగా, శుక్రవారం మరో కేంద్ర మంత్రి అమిత్ షా మదురై సహా పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం నుంచి రెండు రోజులు ప్రచారంలో పాల్గొననున్నారు. కోవై నియోజకవర్గంలో అన్నామలై, నీలగిరిలో ఎల్.మురుగన్, పొల్లాచ్చిలో వసంతరాజన్, చిదంబరంలో కాత్యాయని, తంజావూరులో మురుగానందం, కృష్ణగిరిలో నరసింహన్ మద్దతుగా జరిగే ప్రచార సభలు, రోడ్ షో, ఇంటింటా ప్రచారంలో నిర్మలా సీతారామన్ పాల్గొంటారని పార్టీ నేతలు తెలిపారు.

మంచివాళ్ల కోసమే ప్రచారం చేస్తున్నా!

● మదురై రోడ్‌షోలో కమల్

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దేశం బాగుపడాలంటే, మతతత్త్వ శక్తులను పారద్రోలాలంటే, మంచివారికి అండగా ఉండాల్సిన అవసరం ఏర్పడిందని, అందుకే తాను రాష్ట్రంలో ఇండియా కూటమి విజయం కోసం ప్రచారం చేస్తున్నానని మక్కల్ నీదిమయ్యం నాయకుడు కమల్‌హాసన్ అన్నారు. మదురైలో ఇండియా కూటమి తరపున పోటీచేస్తున్న సీపీఎం అభ్యర్థి వెంకటేశన్‌కు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఈ పర్యటనలో మక్కల్ నీదిమయ్యం కార్యకర్తలు, సీపీఎం, సీపీఐ, డీఎంకే, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పార్టీల జెండాలు పట్టుకుని కమల్‌కు జేజేలు పలికారు. విమానాశ్రయం నుంచి ప్రచార ప్రాంతం వరకు కమల్‌హాసన్ నడిచి వెళ్లారు.



మదురై ఎయిర్‌పోర్టు నుంచి రోడ్‌షో ప్రాంతానికి నడిచి వెళుతున్న కమల్‌హాసన్

పట్టువస్త్రాల ఉత్పత్తికి ప్రోత్సాహం కరువు

● ఆరణి ప్రచార సభలో పళనిస్వామి



ప్రచార సభలో ఎడప్పాడిని సన్మానిస్తున్న నాయకులు, హాజరైన ప్రజలు

ప్యారీస్, ఏప్రిల్ 11: అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో పట్టు ఉత్పత్తి జోరుగా సాగి విదేశాలకు ఎగుమతి చేయడంలో ప్రథమస్థానంలో ఉన్న ఆరణి నియోజకవర్గం ప్రస్తుతం డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వెనుకబడిపోయిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. తిరువణ్ణామలై జిల్లా ఆరణి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీచేస్తున్న అన్నాడీఎంకే అభ్యర్థి జీవీ గజేంద్రన్‌కు మద్దతుగా చేవూరు బైపాస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ఈపీఎస్ పాల్గొని ప్రసంగించారు. పట్టువస్త్రాల ఉత్పత్తికి, మేలు రకమైన పొన్ని బియ్యం దిగుమతికి దేశంలోనే ఆరణి మంచి గుర్తింపు ఉండేదని, అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఈ వృత్తులకు మంచి ప్రోత్సాహం ఉండేదని తెలిపారు. కైలాసనాథర్ ఆలయం, పురాతన సెంజికోట తదితర కొండలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించేలా అన్నాడీఎంకే ప్రభుత్వం పరిచయం చేసిన మినీ క్లినిక్‌లను ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం మూసివేసిందని, అందువల్ల వేలాది మంది డాక్టర్లు, నర్సులు, సిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారని తెలిపారు. పట్టువస్త్రాలు, పొన్ని బియ్యం ఎగుమతిలో అగ్రస్థానంలో ఉన్న ఆరణి ప్రాంతం ప్రస్తుతం 10వ స్థానానికి దిగిపోయిందని ఈపీఎస్ ధ్వజమెత్తారు.

తిరువళ్లువర్ విగ్రహానికి విభూతి, కుంకుమ

- బీజేపీ అభ్యర్థి కలకలం
- డీఎంకే, డీకే నేతల ఆగ్రహం

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి, ప్రముఖ న్యాయవాది అశ్వత్థామన్ తిరువళ్లువర్ విగ్రహానికి విభూతి, కుంకుమ అద్ది పూజలు చేసి కలకలం సృష్టించారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంకే, డీకే నేతలు తిరువళ్లువర్ విగ్రహానికి ఇప్పటిదాకా కాషాయ రంగు పులిమిన బీజేపీ నేతలు ప్రస్తుతం విభూతి, కుంకుమలద్ది కళంకపరిచారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్వత్థామన్ పార్టీ ప్రముఖులతో కలిసి తిరువణ్ణామలై జిల్లా సాత్తనూరు వద్ద గురువారం ఉదయం ఇంటింటి ప్రచారం చేశారు. ఆ సందర్భంగా సాత్తనూరు గ్రామంలోని తిరువళ్లువర్ విగ్రహం నుదుట విభూతిని తాపడం చేసి మధ్యన పెద్ద సైజులో కుంకుమ అద్ది, పూలమాల వేసి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ ప్రముఖులు కూడా పాల్గొన్నారు. గతంలో ఇదే రీతిలో తిరువళ్లువర్ విగ్రహానికి కాషాయ రంగు పులిమినప్పుడు, నుదుట విభూతి, కుంకుమలు అద్దినప్పుడు డీఎంకే, అన్నాడీఎంకే, ద్రావిడ కళగం పార్టీలు తీవ్రస్థాయిలో ఆందోళనలు జరిపాయి. తమిళులు పంచమవేదంగా ఆరాధించే తిరుక్కురళ్‌ను రచించిన తిరువళ్లువర్ సర్వమతాలకు అతీతుడని, ఆయనకు మతం రంగు అంటగట్టి కళంకపరచడం తగదని ముఖ్యమంత్రి స్టాలిన్, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, ద్రావిడకళగం నేత కే వీరమణి ఆగ్రహం వ్యక్తం చేశారు.. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ అభ్యర్థి అశ్వత్థామన్ తిరువళ్లువర్ విగ్రహానికి విభూతి, కుంకుమ అద్దటం గర్హనీయమని డీఎంకే నేతలు సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు.



సాత్తనూరులో తిరువళ్లువర్ విగ్రహం వద్ద ఫొటోకు పోజిస్తున్న బీజేపీ అభ్యర్థి అశ్వత్థామన్, ఆ పార్టీ నిర్వాహకులు

సమాచార దర్శిని

కాశీ, గయలకు ఆధ్యాత్మిక రైలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 11: రాష్ట్రం నుంచి కాశీ, గయా వంటి పుణ్యక్షేత్రాల సందర్శనకు ఆధ్యాత్మిక యాత్రా రైలును రైల్వేశాఖ నడుపనుంది. మే18న కోయంబత్తూర్‌లో బయల్దేరే ఈ రైలు పొల్లాచ్చి, పళని, దిండుగల్, తిరుచ్చి, విల్లుపురం, చెన్నైమీదుగా నడువనుంది. మధుర, హరిద్వార్ గంగా స్నానం, మానసదేవి దర్శనం, అయోధ్యలో బాలరాముడి దర్శనం, కాశీలో గంగాస్నానం, విశ్వనాథ జ్యోతిర్లింగం, విశాలాక్షి ఆలయం, త్రివేణి సంగమాలను సందర్శించవచ్చు. 12రోజుల యాత్రకు ఏసీ కోచ్‌లో ఒకరికి రూ.37,300, స్లీపర్‌కోచ్‌లో రూ.25,200ఛార్జీ నిర్ణయించారు. వివరాలకు 7305858555 నెంబరు సంప్రదించవచ్చు.

11 భాషల్లో సాంకేతిక కోర్సులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 11:ఆన్‌లైన్‌లో నిర్వహించే 174 సాంకేతిక కోర్సులకు తమిళం సహా 11 భాషల్లో పాఠ్యాంశాలు నిర్వహించనున్నట్లు చెన్నై ఐఐటీ తెలిపింది. కళాశాల విద్యార్థులకు ఐఐటీ ఆధ్వర్యంలో 'ఎన్పీటెల్' వెబ్‌సైట్‌లో వందలాది ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు ఆంగ్లంలో మాత్రమే ఉన్న ఈ కోర్సులను దేశంలోని వివిధ రాష్ట్ర భాషల్లోకి అనువదించారు. వివరాలు https://nptel.ac.in/translation అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

1,231మంది ఇంజనీర్లకు సర్వే లైసెన్స్

ఐసిఎఫ్, ఏప్రిల్ 11: రాష్ట్రంలో 1,231 మంది ఇంజనీర్లకు భూ సర్వే లైసెన్స్‌ను ప్రభుత్వం మంజూరుజేసింది. గృహాలు, స్థలాలు కొనుగోలు చేసే వారు వాటికి సంబంధించిన పట్టాల్లో పేరు మార్పు చేయించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం దరఖాస్తు చేసుకొనే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఒక స్థలాన్ని వివిధ భాగాలుగా విభజించి విక్రయించే సమయంలో వాటికి వేర్వేరుగా పట్టాలు పొందాల్సి ఉంటుంది. ఇలాంటి స్థలాలను సర్వే చేసి పట్టాలు అందజేసేందుకు 1,231 మంది ఇంజనీర్లకు భూసర్వే శాఖ లైసెన్స్ అందజేసింది.

తిరిగివెళ్లని వలస పక్షి

ఐసిఎఫ్, ఏప్రిల్ 11: విదేశాలకు తిరిగి వెళ్లకుండా ఓ వలస పక్షి తిరుప్పూర్‌లోనే మకాం వేసింది. తిరుప్పూర్‌లోని నంజరాయన్ కుళం పక్షుల శరణాలయానికి గత ఏడాది ఐరోపాకు చెందిన 'వలైమూక్కు ఉల్లాన్' అనే పక్షి వచ్చింది. శీతాకాలం ముగిసి వేసవి ప్రారంభం కావడంతో ఇతర వలస పక్షులు స్వదేశానికి తిరిగి వెళ్లాయి. అయితే ఈ పక్షి మాత్రం కొలనులోనే ఉంటోంది. ఈ విషయమై తిరుప్పూర్ నేచర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రన్ మాట్లాడుతూ... ఏ కారణం చేతనో ఈ పక్షి ఇక్కడే ఉందని, ఈ పక్షిని ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నామన్నారు.

వెప్పేరిలో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 11: స్థానిక వెప్పేరి ఈవీకే సంపత్ రోడ్డులో ఉన్న నారాయణగురు రోడ్డు జంక్షన్ నుంచి జర్మియా రోడ్డు జంక్షన్ వరకు చెన్నై మెట్రోవాటర్ బోర్డు ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణం జరుగుతోంది. ఈ కారణంగా వెప్పేరి. పురసైవాక్కం ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ మార్పులు ప్రకటించారు.

- ఈవీకే సంపత్ రోడ్డులో ఉన్న హంటర్స్ రోడ్డు-నారాయణగురు రోడ్డు జంక్షన్-జర్మియా రోడ్డు తాత్కాలికంగా మూసివేశారు.
- హంటర్స్ రోడ్డులో డౌటన్ జంక్షన్ నుంచి వచ్చే ద్విచక్రవాహనాలు, చిన్న వాహనాలు జనరల్ కాలేజ్ రోడ్డు, మెడెక్స్ రోడ్డు, వెప్పేరి హైరోడ్డు గుండా గమ్యస్థానాలకు చేరుకోవాలి.
- హంటర్స్‌రోడ్డులో డౌటన్‌నుంచివచ్చే ఎంటీసీ బస్సులు, భారీవాహనాలు చూలై హైరోడ్డు, రాజా ముత్తయ్య రోడ్డు, వెప్పేరి హై రోడ్డు గుండా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

92 శాతం ముగిసిన రైలు మార్గాల విద్యుద్దీకరణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 11: దక్షిణ రైల్వేలోని రైలుమార్గంలో విద్యుదీకరణ పనులు 92 శాతం ముగిసాయని అధికారులు తెలిపారు. భారత రైల్వే బ్రాడ్ గేజ్‌లో 65,141 కి.మీలో 61,813 కి.మీ విద్యుద్దీకరణ పనులు జరిగాయి. అందులో దక్షిణ రైల్వేకు సంబంధించి మొత్తం 5,087 కి.మీ మార్గంలో 4,700 కి.మీ విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయని, మరో మూడు నెలల్లో మిగిలిన పనులు పూర్తి చేయనున్నామని అధికారులు తెలిపారు.

పెరిగిన కూరగాయల ధరలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 11: దిగుమతులు తగ్గడంతో కోయంబేడు మార్కెట్లో కూరగాయల ధరలు పెరిగాయి. ఈ మార్కెట్‌కు చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్, రాణిపేట వచ్చి జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి ప్రతిరోజు 7,500 టన్నుల ఆకుకూరలు, కాయగూరలు దిగుమతవుతున్నాయి. రాష్ట్రంలో ఎన్నికల నిబంధనలు అమలులో ఉండడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల కారణంగా పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల సంఖ్య తగ్గింది. ఈ కారణంగా కిలో బీన్స్, నిమ్మపండ్లు రూ.120, బీట్‌రూట్, చేమ దుంపలు రూ.50, కాకరకాయలు, చిక్కుడుకాయలు రూ.40, వంకాయలు, బెండకాయలు, బంగాళా దుంపలు రూ.35, ముల్లంగి రూ.45 అని కూరగాయల ధరలు పెరిగాయి.

నగరానికి చేరుకున్న 19మంది జాలర్లు

పెరంబూర్, ఏప్రిల్ 11: శ్రీలంక జైళ్ల నుంచి విడుదలైన 19 మంది జాలర్లు విమానం ద్వారా చెన్నై చేరుకున్నారు. గత నెల 16వ తేది సముద్రంలో చేపల వేటకు వెళ్లిన 21 మంది జాలర్లు సరిహద్దులు దాటారంటూ శ్రీలంక నావికాదళం అరెస్ట్‌చేసి జైళ్లకు తరలించారు. అరెస్టయిన జాలర్లను విడిపించేలాచర్యలు చేపట్టాలని జాలర్ల బంధువులు, సంఘాలు కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలకు విజ్ఞప్తిచేశారు. దీంతో,భారత రాయబారకార్యాలయం అధికారులు శ్రీలంక ప్రభుత్వంతో జరిపిన చర్చల కారణంగా అరెస్ట్‌చేసిన జాలర్లలో 19మందిని విడుదల చేస్తూ శ్రీలంక న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. విడుదలైన జాలర్లు విమానంలో నగరానికి చేరుకోగా, ఆహ్వానించిన మత్స్యశాఖ అధికారులు, వారిని వాహనాల్లో స్వగ్రామాలకు పంపించారు.

ప్రధాని రోడ్ షోలో నిబంధనల ఉల్లంఘన పోలీసుల కేసు నమోదు

పెరంబూర్, ఏప్రిల్ 11: నగరంలో ప్రధాని పాల్గొన్న రోడ్ షోలో నిబంధనలు ఉల్లంఘించారంటూ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈనెల 8వ తేది నగరానికి వచ్చిన ప్రధాని మోదీ, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా టి.నగర్ పనగల్ పార్క్ నుంచి తేనాంపేట సిగ్నల్ వరకు రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ రోడ్ షోకు పోలీసులు పలు నిబంధనలు విధించారు. కానీ, రోడ్‌షో సందర్భంగా నిబంధనలు అతిక్రమించి పలుప్రాంతాల్లో పార్టీజెండాలు ఏర్పాటు చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి భూపతి ఫిర్యాదుతో పాండి బజార్ పోలీసులు కేసు నమోదుచేశారు.

నేడు సీపీఎం నేతల ప్రచారం

పెరంబూర్, ఏప్రిల్ 11: డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా శుక్రవారం సీపీఎం నేతలు ప్రచారం చేయనున్నారు. ఈమేరకు ఆ పార్టీ విడుదల చేసిన ప్రకటనలో, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి దిండుగల్, రాష్ట్రకార్యదర్శి బాలకృష్ణన్ కడలూరు, రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులు జి.రామకృష్ణన్ ఉత్తర చెన్నై పరిధిలోని పెరంబూర్, కేంద్రకమిటీ సభ్యురాలు వాసుకి దిండుగల్ ప్రచారంలో పాల్గొంటారని పార్టీ తెలియజేసింది.





బ్రాడ్‌వేలోని డాన్‌బాస్కో మహోన్నత పాఠశాల గ్రౌండ్‌లో మహిళల సామూహిక ప్రార్థనలు - ట్రిప్లికేన్ పెద్ద మసీదులో ఇస్లామీయుల సందడి

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక సౌరభం / ఈద్గాల్లో రంజాన్ సామూహిక ప్రార్థనలు

ప్యారీస్, ఏప్రిల్ 11: ఈద్ పండుగ నెలరోజుల ఆరాధన ఫలించిన శుభ సమయం. రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు గురువారం రంజాన్ పండుగను అత్యంత భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలతో ఈద్గాలు, ప్రార్థనా స్థలాల్లో ఆధ్యాత్మిక పరిమళం వెల్లివిరిసింది. తమిళనాడు ప్రభుత్వ చీఫ్ హాజీ డా.సలావుద్దీన్ మహ్మద్ అయూబ్ ఈద్ ఉల్ ఫితర్ జరుపుకోవచ్చని అధికారికంగా ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ సందడి నెలకొంది. నెలరోజుల పాటు ఉపవాసం పాటించిన ముస్లిం సోదరులు బుధవారం ఐదవ ప్రార్థనతో దీక్ష విరమించుకున్నారు. మార్చి 12న ప్రారంభమైన రంజాన్ ఉపవాసాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తిచేయగలిగేలా శక్తి, భక్తి ప్రసాదించినందుకు అల్లాకు కృతజ్ఞతలు తెలియజేశారు. పండుగ రోజు తెల్లవారుజామున ముస్లింలు ఫేజర్ నమాజు అనంతరం కుటుంబ సభ్యులంతా నూతన వస్త్రాలు ధరించారు. అత్తరు పూసుకొని, సీర్ కుర్మా సేవించి అంతా కలసి సమీపంలోని మసీదులకు వెళ్లారు. తమ అపరాధాలు మన్నించమని, సన్మార్గంలో నడపమని దువా చేశారు. అలాగే, సమస్త మానవాళి సుఖసంతోషాలు కాంక్షిస్తూ ప్రార్థించారు. తమ దేశాన్ని, యావత్ భూప్రపంచాన్ని రక్షించమని అల్లాను వేడుకున్నారు. సామూహిక ప్రార్థనల అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్ ముబాకర్ అంటూ కరచాలనం, ఆత్మీయ ఆలింగనాలతో అనుబంధాన్ని చాటుకున్నారు. రాజధాని నగరంలో రాయపేటలోని సెయింట్ మేరీస్ చర్చి గ్రౌండ్, బ్రాడ్‌వే హైవేలో ఉన్న డాన్‌బాస్కో మహోన్నత పాఠశాల గ్రౌండ్, ట్రిప్లికేన్ పెద్ద మసీదు, పెరియమెట్ మసీదు, థౌజండ్ లౌట్ మసీదుల్లో నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో ముస్లింలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జకాత్, ఫిత్రా దానాలు...

పరిపూర్ణ విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో ఉపవాసాలు పూర్తిచేసిన ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్ పర్వదినాన జకాత్, ఫిత్రా దానాలు చేశారు. బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు వారిని ఆహ్వానించి బిర్యానీ, ఖర్జూరాలు, సేమియా పాయసం పంచిపెట్టి ఆనందం పంచుకున్నారు. ఈ విధంగా రంజాన్ పండుగ సమాజంలో ఒక చక్కని సుహృద్భావ పూర్వకమైన, ప్రేమ పూరితమైన సామరస్య కుసుమాలను వికసింపజేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం అనుమతించిన పాఠశాల, కళాశాలల మైదానాలు, క్రీడా మైదానాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు పోలీసులు పటిష్ట భద్రత కల్పించారు.

తిరునల్వేలి ఎన్నికలు నిలిపివేయాలి

- హైకోర్టులో పిటిషన్

ప్యారీస్, ఏప్రిల్ 11: తిరునల్వేలి లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్నికలు నిలిపివేయాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ దాఖలైంది. ఈ నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ పోటీచేస్తున్నారు. ఆయన దాఖలుచేసిన నామినేషన్ పత్రాల్లో రూ.1,500 కోట్ల విలువైన ఆస్తులను చూపించకుండా దాచివేశారని ఆరోపిస్తూ మదురైకి చెందిన ఓ న్యాయవాది పిటిషన్ వేశారు. అందులో, నయినార్ నాగేంద్రన్ దాఖలైన క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉందని, ఆ విషయాన్ని కూడా ఆయన నామినేషన్ సమయంలో చూపలేదని తెలిపారు. ఈ పిటిషన్ త్వరలో విచారణకు వచ్చే అవకాశముందని కోర్టు వర్గాలు తెలిపాయి.

ఎన్నికలు బహిష్కరించాలనుకున్న వారిని బుజ్జగించండి

ఐసిఎఫ్, ఏప్రిల్ 11: ఎన్నికలను బహిష్కరించనున్నట్లు ప్రకటించిన ప్రజలను బుజ్జగించి ఓటు వేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులకు ఈసీ ఉత్తర్వులు జారీచేసింది. కాంచీపురం జిల్లా పరందూర్ విమానాశ్రయం ఏర్పాటుకు నిరసనగా ఏకనాపురం గ్రామస్తులు ఎన్నికలు బహిష్కరించనున్నట్లు ప్రకటించారు. అలాగే, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తమ డిమాండ్ల సాధన కోసం ఎన్నికలు బహిష్కరించనున్నట్లు ప్రకటించారు. దీనిపై స్పందించిన ఎన్నికల కమిషన్, ఆ ప్రజలతో చర్చలు జరిపి వారిని సమాధానపరచి ఎలాగైనా ఓటు వేసేలా చూడాలని ఎన్నికల అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించిన పోలీసులు



తపాలా ఓట్లు వేస్తున్న పోలీసులు

పెరంబూర్, ఏప్రిల్ 11: చెన్నై జిల్లాలో ఎన్నికల బందోబస్తులో ఉన్న పోలీసులు తపాలా ఓటు హక్కు వినియోగం గురువారం నుంచి ప్రారంభమైంది. జిల్లా పరిధిలో మూడు లోక్‌సభ నియోజకవర్గాలుండగా, ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పలు జిల్లాలకు చెందిన సుమారు 19,000 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారు. ఆ పోలీసులు తమ ఓటును తపాలా ద్వారా నమోదుచేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనుమతిచ్చింది. ఆ ప్రకారం, వాషర్‌మెన్‌పేట-బేసిన్‌బ్రిడ్జి రోడ్డు సమీపంలోని ఉత్తర చెన్నై ఎన్నికల అధికారి కార్యాలయం, అడయార్ ముత్తులక్ష్మి రోడ్డులోని దక్షిణ చెన్నై ఎన్నికల అధికారి కార్యాలయం, షేనాయ్‌నగర్ పుల్లా అవెన్యూలోని మధ్య చెన్నై ఎన్నికల కార్యాలయాల్లో పోలీసులు తపాలా ఓటు వినియోగించుకొనేలా ఏర్పాటుచేశారు. గురువారం ప్రారంభమైన తపాలా ఓటు నమోదు శనివారం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, తపాలా ఓటుకు దరఖాస్తు చేసుకున్న అధికారులు, పోలీసులు తగిన గుర్తింపుకార్డులతో వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రానికి బీజేపీ చేసింది శూన్యం : సినీ నటి గౌతమి

అడయార్, ఏప్రిల్ 11: గడిచిన దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ రాష్ట్రానికి చేసింది శూన్యమని ఇటీవల అన్నాడీఎంకేలో చేరిన సినీ నటి గౌతమి విమర్శించారు. నీలగిరి లోక్‌సభ స్థానం నుంచి అన్నాడీఎంకే తరఫున పోటీ చేస్తున్న లోకేశ్ తమిళ్ సెల్వన్‌కు మద్దతుగా ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్ళుగా అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. అలాంటి భారతీ జనతా పార్టీ రాష్ట్రానికి అక్కర్లేదన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీని చిత్తుగా ఓడించాలని ఆమె పిలుపునిచ్చారు. గత మూడున్నరేళ్ళుగా కేంద్ర మంత్రిగా ఉన్న ఎల్.మురుగన్ ఇపుడు నీలగిరి స్థానం నుంచి బరిలో దిగుతున్నారన్నారు. ఈయన ఈ మూడున్నరేళ్ళ కాలంలో నీలగిరి జిల్లా వాసులకు ఒక్క మంచి పని అయినా చేశారా అని సినీ నటి గౌతమి ప్రశ్నించారు. చేతిలో అధికారం, అన్ని రకాల సదుపాయాలు ఉన్నప్పటికీ నీలగిరి ప్రజలకు ఆయన ఏం చేయలేదని ఆమె విమర్శలు గుప్పించారు.

వంద శాతం ఓటింగ్ కోసం వినూత్న ప్రచారం

పెరంబూర్, ఏప్రిల్ 11: రాష్ట్రంలో ఈ నెల 19న జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా ఎన్నికల సంఘం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. రాజకీయ పార్టీలకు ధీటుగా ఓటు హక్కు ప్రాధాన్యతపై ఫ్లెక్సీలు, కరపత్రాలు, స్టిక్కర్లు సహా పలు రకాలుగా అవగాహన కార్యక్రమాలు ఈసీ చేపడుతోంది. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన టెంపుల్ అడ్వంచర్ డైరక్టర్ ఎస్పీ అరవింద్ తరుణశ్రీ, ఓటు హక్కు వినియోగంపై వినూత్న ప్రచారం చేపట్టారు. స్థానిక నీలాంగరైలో ఆరుగురు స్కూబా డ్రైవర్లు సముద్రంలో 60 అడుగుల లోతుకు వెళ్లి, అక్కడ ఈవీఎం, ఎన్నికల సామగ్రిని ప్రదర్శిస్తూ... 'నా ఓటు బలం నాకు తెలుసు', 'నా దేశం...నా ఓటు', 'ఓటు వేయడం నా బాధ్యత' అనే వ్యాఖ్యలు రాసిన ప్లకార్డులు ప్రదర్శించారు.



సముద్రపు లోతున ఈవీఎంతో ఎన్నికల అవగాహన ప్రచారం

పాంబన్‌లో వెనక్కి మళ్లిన సముద్రం



పెరంబూర్, ఏప్రిల్ 11: రామనాథపురం జిల్లా పాంబన్ ప్రాంతంలో సముద్రం హఠాత్తుగా 200 మీటర్ల వెనక్కి మళ్లింది. వాతావరణ మార్పుల కారణంగా కొద్దిరోజులుగా తిరుచెందూర్, కన్నియాకుమారి, రామేశ్వరం తదితర తీరాల్లో సముద్రం వెనక్కి వెళ్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో, పాంబన్ ప్రాంతంలో గురువారం ఉదయం సముద్రం హఠాత్తుగా 200 మీటర్ల వెనక్కి వెళ్లింది. దీంతో, బండరాళ్లు, గవ్వలు బయటపడ్డాయి. కొద్దిసేపటి అనంతరం సముద్రం యథాస్థితికి చేరుకుంది.

స్మారక స్థూపాల ఏర్పాటుకు సీఎం రూ.10 లక్షల ఆర్థిక సాయం

అడయార్, ఏప్రిల్ 11: రెండో ప్రపంచ యుద్ధ సమయంలో థాయిలాండ్ - బర్మా దేశాల మధ్య రైలు మార్గం నిర్మాణంలో పాల్గొన్న కూలీల్లో అనేక మంది తమిళ కూలీలు ప్రాణాలు కోల్పోగా, వారికి స్మారకస్థూపాల నిర్మాణం కోసం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రూ.10 లక్షల ఆర్థిక సాయం చేశారు. థాయిలాండ్‌లోని కంచనపురిలో మే ఒకటో తేదీన జరిగే కార్యక్రమంలో ఈ స్మారకస్థూపాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ నిధులను థాయిలాండ్ తమిళ సంఘం అధ్యక్షుడు రమేష్ ధర్మరాజన్, ఉపాధ్యక్షుడు రమణన్, ఆర్గనైజర్ సుందరకుమార్ కు ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు.

టి.నగర్‌లో 222 కేజీల వెండి చోరీ

అడయార్, ఏప్రిల్ 11: స్థానిక టినగర్‌లోని ఒక వెండి హోల్ సేల్ షాపులో 222 కేజీల వెండి చోరీకి గురైంది.. ఈ చోరీకి గురైన వెండి విలువ రూ.1.80 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు.. పోలీసుల కథనం మేరకు...టి.నగర్‌లోని నార్త్ ఉస్మాన్ రోడ్డులో 'జలానీ' అనే పేరుతో జయంతిలాల్ జలానీ (35) అనే వ్యాపారి హోల్ సేల్ వెండి దుకాణం నడుపుతున్నారు. ప్రతి యేటా ఆర్థిక సంవత్సరం ముగింపులో ఆడిటింగ్ చేస్తుంటారు. ఆ మేరకు ఇటీవల జరిగిన ఆడిటింగ్‌లో దుకాణంలో భారీగా వెండి నగలు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీనిపై యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆ దుకాణంలో పనిచేసే శరవణన్, అజ్మల్, మహేంద్రన్, వినోద్, పింకేష్, మదన్ అనే ఆరుగురిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

ఎన్నికల ప్రచారంలో పేలిన బాణసంచా

- రెండు గుడిసెల దగ్ధం

పెరంబూర్, ఏప్రిల్ 11: నాగపట్టణంలో బీజేపీ ఎన్నికల ప్రచారంలో కాల్చిన బాణసంచా కారణంగా రెండు గుడిసెలు దగ్ధమయ్యాయి. నాగపట్టణం నియోకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎస్‌జీఎం రమేష్ గురువారం పుదియనంబియార్ నగర్ జాలర్ల గ్రామంలో ప్రచారానికి వెళ్లారు. ఆయనను ఆహ్వానిస్తూ కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఆ సమయంలో రోడ్డు పక్కనున్న గుడిసెలపై నిప్పురవ్వలు పడడంతో మంటలు ఎగసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొనేలోపు రెండిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో భారీ ఆస్తినష్టం వాటిల్లిందనే బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

'లింక్' క్లిక్ వెంటనే రూ.1.45 లక్షలు స్వాహా

పెరంబూర్, ఏప్రిల్ 11: మొబైల్‌కు వచ్చిన లింక్ క్లిక్ చేసి రూ.1.45 లక్షలు మోసపోయిన ఘటన పులియాన్‌తోపులో చోటుచేసుకుంది. నరసింహన్‌నగర్‌కు చెందిన చిరంజీవి అంబత్తూర్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 8న అతడి మొబైల్‌కు 'మీ ఆక్సిస్ బ్యాంక్ ఖాతాకు పొరపాటున రూ.9,800 జమ అయింది' అనే మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌లోని లింక్‌ను క్లిక్ చేసిన వెంటనే ఆయన బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.1.45 లక్షలు అదృశ్యమైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదుతో సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రధాని మోదీ మళ్ళీ మళ్ళీ రావాలి!

- సీపీఐ నేత ముత్తరసన్

అడయార్, ఏప్రిల్ 11: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఇండియా కూటమి బలం మరింత పెరగడానికి ప్రధాని నరేంద్ర మోదీ మరిన్నిసార్లు రాష్ట్ర పర్యటనకు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ కోరారు. తంజావూరు లోక్‌సభ డీఎంకే అభ్యర్థి తంజై అబ్రహాంకు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమిళనాడులో ఇండియా కూటమి బలం మరింత పెరగాలంటే ప్రధాని మోదీ మరిన్ని సార్లు రాష్ట్రానికి రావాలని ఆయన కోరారు. కేంద్రంలో పదేళ్ళుగా ప్రధాని మోదీ అధికారంలో ఉన్నారని, ఆయన కచ్చాదీవిని స్వాధీనం చేసుకోలేకపోయారన్నారు. ఇపుడు మాత్రం కచ్చాదీవు సమస్యను వివాదాస్పదంగా మార్చేశారన్నారు. హిట్లర్‌కు, నరేంద్ర మోదీకి ఏమాత్రం తేడా లేదన్నారు. దేశంలో విపక్ష పార్టీలు, ప్రాంతీయ పార్టీలు ఉండరాదని కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఇండియా కూటమి కృషి చేస్తుందన్నారు. ఇండియా కూటమి సీట్ల కోసం పొత్తుపెట్టుకోలేదని, సిద్ధాంతం కోసం ఒకటిగా ఏర్పడటం జరిగిందన్నారు. అంతేకాకుండా, మత సామరస్య పరిరక్షణ కోసం పనిచేస్తున్నారు. ఈ ఎన్నికలు ఇద్దరు అభ్యర్థుల మధ్య జరిగే పోరు కాదని, సర్వాధికారి, ఫాసిస్ట్‌కు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం కాదని ఆయన పేర్కొన్నారు.



చోళుల కాలంనాటి శిలాఫలకం లభ్యం

ఐసిఎఫ్, ఏప్రిల్ 11: చోళుల కాలం నాటి శిలాఫలకం కనుగొన్నట్లు సరస్వతి మహల్ గ్రంథాలయ తమిళ పండితులు, చరిత్ర పరిశోధకులు మణిమారన్ తెలిపారు. మొదటి ఆదిత్య చోళుడి బిరుదైన రాజకేసరి పేరు మీద వెలసిన రాజకేసరి చతుర్వేద మంగళం కాలక్రమంలో రాజగిరిగా మారిందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ధర్మరాజ్ అనే రైతు పొలంలో నాలుగు శిలాఫలకాలు కనుగొన్నామని, వీటిలో చోళుల కాలం నాటి లిపిలో చోళుడు విన్నగరం అనే ఆలయానికి భూములు దానం చేసిన వివరాలు చోటుచేసుకున్నాయని తెలిపారు.

పాపనాశం సమీపంలోని తోటలో లభించిన శిలాఫలకం

13, 14 తేదీల్లో స్నూకర్ పోటీలు



మీడియాతో మాట్లాడుతున్న కోచ్ విజయ్‌కుమార్, అజంతా శంకరరావు తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 11: స్థానిక ప్యారీస్ గిడ్డంగి వీధిలో 119 ఏళ్ల చరిత్ర కలిగిన సదరన్ ఇండియా వైశ్య సంఘం (శివా) ఆధ్వర్యంలో ఈ నెల 13,14 తేదీల్లో స్నూకర్ ఛాంపియన్ షిప్-2024 జరుగనున్నాయి. ఈ సంఘంలో బిలియర్డ్స్ క్రీడా విభాగం ప్రారంభించి 80 ఏళ్లు పూర్తయింది. ఉగాది, తమిళ నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని ప్రవేశ రుసుము లేకుండా 18 ఏళ్ల నుంచి 75 ఏళ్ల వరకు స్నూకర్ పోటీలకు అనుమతించనున్నారు. ఈ మేరకు గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శివా అధ్యక్షుడు అజంతా అధినేత డా.కనిగెలుపుల శంకరరావు, కోచ్, టోర్నమెంట్ డైరెక్టర్ పేరూరు విజయ్‌కుమార్ సంయుక్తంగా మ్యాచ్ గురించి వివరించారు. ధనవంతులకు మాత్రమే అందుబాటులో ఉండే స్నూకర్ పట్ల ఆసక్తి కలిగించేలా అసోసియేషన్ సభ్యులు, వారి పిల్లలు, ఇతరుల కోసం ఈ నెల 13,14 తేదీల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, ఇందులో పాల్గొనేందుకు ఇప్పటివరకు 35 మంది రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. అజంతా శంకరరావు ప్రారంభించనున్న స్నూకర్ పోటీల విజయోత్సవ సభలో ప్రస్తుత స్నూకర్ వరల్డ్ ఛాంపియన్ అనుపమ రామచంద్రన్, నేషనల్ ఛాంపియన్ శృతి లక్ష్మీనారాయణ పాల్గొని, పాల్గొన్న వారందరికి షీల్డులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శులు పువ్వాడ అశోక్‌కుమార్, మద్ది నరసింహులు, ట్రెజరర్ పెసల రమేష్, కేకే త్రినాధ్ కుమార్, కో-ఆర్డినేటర్ రామనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేసవి రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 11: వేసవి రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. వాటి వివరాలు..

- నెం.07193 సికింద్రాబాద్-కొల్లాం ప్రత్యేక రైలు ఈనెల 17,24, మే 1,8,15,22,29, జూన్ 5,12,19,26(గురువారం)తేదీల్లో సికింద్రాబాద్ నుంచి సాయంత్రం 6.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. మరు మార్గంలో నెం.07194 కొల్లాం-సికింద్రాబాద్ ప్రత్యేకరైలు ఈనెల19,26, మే 3,10,17, 12431, జూన్ 7,14,21,28 (శుక్రవారం)తేదీల్లోకొల్లాంలో మధ్యాహ్నం 2.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజుఉదయం 9.40గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- నెం.06081 కొచ్చువెల్లి-షాలిమార్ ప్రత్యేక రైలు ఈ నెల 12,19,26, మే 3,10,17,24,31 (శుక్రవారం) తేదీల్లో కొచ్చువెల్లిలో సాయంత్రం 4.20 గంటలకు బయల్దేరి మూడవ రోజు మధ్యాహ్నం 1.40 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. మరు మార్గంలో నెం.06082 షాలిమార్-కొచ్చువెల్లి ప్రత్యేక రైలు ఈ నెల 15,22,29 మే 6,13,20,27, జూన్3(సోమవారం) తేదీల్లో షాలిమార్‌లో మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి మూడవ రోజు ఉదయం 9.55 గంటలకు కొచ్చువెల్లి చేరుకుంటుంది.
- 06097 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-బార్మర్ (రాజస్థాన్) ప్రత్యేక రైలు ఈ నెల 14,21 (ఆదివారం) తేదీల్లో చెన్నై సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి మూడవ రోజు మధ్యాహ్నం 1.40 గంటలకు బార్మర్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06098 బార్మర్-డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ప్రత్యేక రైలు ఈ నెల 17 (గురువారం), 26 (శుక్రవారం) తేదీల్లో బార్మర్‌లో రాత్రి 9 గంటలకు బయల్దేరి మూడవ రోజు సాయంత్రం 5 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్లకు ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురు హరియాణా వాసుల అరెస్టు

పెరంబూర్, ఏప్రిల్ 11: స్థానిక పెరంబూర్ ప్రాంతంలో హెడ్ కానిస్టేబుల్ భార్య సహా ఇద్దరి వద్ద చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముగ్గురు హరియాణా వాసులను పోలీసులు అరెస్ట్ చేశారు. చైన్ స్నాచింగ్‌పై అందిన ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా హరియాణాకు చెందిన సచిన్ కుమార్ (24), అంకిత్ (24), అంకిత్ యాదవ్ (26) అను అరెస్ట్ చేశారు. వీరు విహార యాత్ర పేరుతో నగరానికి చేరుకొని, మోటారు సైకిళ్లు అద్దెకు తీసుకొని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతుంటారని తెలిసింది. వీరిని పోలీసుల అదుపులోకి తీసుకొనే సమయంలో కింద పడగా ముగ్గురి చేతి ఎముకలు విరిగినట్లు సమాచారం.

ఇంట్లో చిలుకలు పెంచితే జైలు శిక్ష

ఐసిఎఫ్, ఏప్రిల్ 11: ఇంట్లో చిలుకలు పెంచితే జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని అటవీ శాఖ హెచ్చరించింది. కడలూరు నియోజకవర్గంలో పోటీచేసే పీఎంకే అభ్యర్థి తంగర్‌బచ్చన్‌కు చిలుక జోస్యం చెప్పినందుకు జ్యోతిష్యుడిని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అతడి వద్ద ఉన్న చిలకలు స్వాధీనం చేసుకొని తంగర్‌బచ్చన్‌కు జరిమానా విధించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర అటవీ శాఖ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో.. ఇళ్లలో చిలుకలు పెంచుకోవడం దీర్ఘకాలంగా వాడుకలో ఉందని, 1990-91లో చిలుకల పెంపకంపై అమలుచేసిన నిషేధం గురించి ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల వాటిని పెంచుతున్నారని, చెన్నై వంటి నగరాల్లో ఆన్‌లైన్‌లో ఏడాదికి 700లకు పైగా చిలుకలు విక్రయమవుతున్నాయని, చట్టాన్ని ఉల్లంఘించి వీటిని పెంచే వారికి రూ.25 వేలు జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష విధించనున్నామని హెచ్చరించారు.

ఏటీఎంలో రూ.13 లక్షల చోరీ

ప్యారీస్, ఏప్రిల్ 11: స్థానిక తాంబరం సమీపంలోని పడప్పై బజారు రోడ్డులో ఉన్న ఓ బ్యాంక్ ఏటీఎంలో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు రూ.13 లక్షలు దోచుకున్న సంఘటన ఆందోళనకు దారితీసింది. ఏటీఎం వద్దకు ఇటీవల నెంబరు ప్లేట్ లేని కారులో వెళ్లిన నలుగురు వ్యక్తులు, బ్యాంక్ సీక్రెట్ కోడ్ నెంబర్‌ను ఉపయోగించి వినూత్న పద్ధతిలో రూ.13 లక్షలు డ్రా చేసుకొని అక్కడి నుంచి పరారైనట్లు బ్యాంక్ అధికారులు అందజేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు, నిందితుల కోసం గాలిస్తున్నారు.

హాస్టల్‌లో త్రిపుర యువతి ఆత్మహత్య

ప్యారీస్, ఏప్రిల్ 11: చెంగల్పట్టులోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను త్రిపుర రాష్ట్రానికి న్యూటాన్ (26), ఆయన భార్య రక్షణ (20)లు రెండేళ్లుగా నిర్వహిస్తున్నారు. కొన్నేళ్లపాటు కాపురం చేసిన భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, రక్షణ బుధవారం రాత్రి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, ఆత్మహత్యపై దర్యాప్తు చేపట్టారు.

నీటితొట్టెలో పడిన నెమలిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



నెమలిని రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, ఏప్రిల్ 11: నీటితొట్టెలో పడిన నెమలిని అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా రక్షించారు. మదురై జిల్లా తిరుమంగళం సమీపం కీలకోట గ్రామంలోని ఓ తోటలో పెద్ద నీటి తొట్టె ఏర్పాటుచేశారు. బుధవారం తోటలో సంచరిస్తున్న నెమలి, అక్కడ పామును గమనించిన దానిని తరిమేందుకు యత్నించి హఠాత్తుగా నీటితొట్టెలో పడింది. తొట్టెలో నెమలి పడడం గమనించిన తోటలో పనిచేస్తున్న కార్మికులు, తిరుమంగళం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడకు చేరుకొని తొట్టెలో పడిన నెమలిని రక్షించి తిరుమంగళం అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

'రెండాకులు' గుర్తుకు ఓటు వేయండి

- డీఎంకే అభ్యర్థిని కోరిన అన్నాడీఎంకే కార్యకర్తలు



డీఎంకే అభ్యర్థి రాజాకు కరపత్రాలు అందజేస్తున్న అన్నాడీఎంకే కార్యకర్తలు


పెరంబూర్, ఏప్రిల్ 11: 'రెండాకులు' గుర్తుకు ఓటేయాలని డీఎంకే అభ్యర్థిని అన్నాడీఎంకే శ్రేణులు విజ్ఞప్తి చేసిన సంఘటన మేట్టుపాళయంలో చోటుచేసుకుంది. రంజాన్ సందర్భం గా గురువారం మేట్టుపాళయంలోని ఓ మసీదులో ప్రార్థనలు ముగించి వస్తున్న ముస్లింలను అన్నాడీఎంకే కార్యకర్తలు ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆ సమయం లో అటువైపు నీలగిరి నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి ఎ.రాజా వాహనం రావడాన్ని గమనించిన అన్నాడీఎంకే కార్యకర్తలు అక్కడకు చేరుకున్నారు. వారిని చూసిన రాజా వాహనం ఆపడంతో, ఆయనకు అన్నాడీఎంకే కరపత్రం అందజేసిన కార్యకర్తలు, రెండాకులు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అందుకు చిరునవ్వులు చిందించిన రాజా, కార్యకర్తలకు షేక్ హ్యాండ్ ఇచ్చి వెళ్లిపోయారు.

పుదుచ్చేరి త్రిముఖ పోటీలో

గెలుపెవరిదో?

సార్వత్రిక సమరం


బీజేపీ అభ్యర్థి నమశ్శివాయం


కాంగ్రెస్ అభ్యర్థి వైద్యలింగం


అన్నాడీఎంకే అభ్యర్థి తమిళ్‌వేందన్

● వీఐపీ నియోజకవర్గం

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో 11 సార్లు విజయం సాధించిన కాంగ్రెస్ 12 వ సారి గెలిచేందుకు తహతహలాడుతోంది. అదే సమయంలో ఈ నియోజకవర్గంలో ఎంపీ సీటు గెలవని బీజేపీ తొలి విజయం కోసం ఉవ్విళ్లూరుతోంది. ఈ రెండు పార్టీలకు ధీటుగా అన్నాడీఎంకే కూడా పోటీపడుతోంది. అంగబలం, అర్థిక బలం మెండుగా కలిగిన ఈ మూడు పార్టీలూ ప్రస్తుతం తీవ్రస్థాయిలో ప్రచారం చేస్తున్నాయి. పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గం తమిళనాడు రాష్ట్రాన్ని ఆనుకుని ఉన్న పుదుచ్చేరి, కారైక్కాల్, కేరళ రాష్ట్రంలోని మాహి, ఆంధ్రప్రదేశ్ సమీపంలోని యానాం ప్రాంతాలను కలిగి ఉంది. ఈ లోక్‌సభ నియోజకవర్గం పుదుచ్చేరి, మాహి, యానం ప్రాంతాలతో కూడిన పుదుచ్చేరి జిల్లా, కారైక్కాల్ అనే రెండు జిల్లాలున్నాయి. ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోనే పుదుచ్చేరిలో 23, మాహి, యానాంలో తలా ఒకటి. కారైక్కాల్ జిల్లాలో 5 చొప్పున మొత్తం 30 శాసనసభ నియోజకవర్గాలున్నాయి. ఫ్రెంచ్ సంస్కృతీ సంప్రదాయాలకు కిటికీ వంటిదిగా అభివర్ణించే పుదుచ్చేరి 1962 సం. నాటి రాజ్యాంగ ధర్మాసనం 14వ చట్ట సవరణ ప్రకారం యూనియన్ ప్రదేశంగా మారింది. అప్పటివరకూ ఆ రాష్ట్రాన్ని పాండిచ్చేరిగానే పిలిచేవారు. 2006 తరువాత పాండిచ్చేరి అనే పేరు కాస్త పుదుచ్చేరిగా మారింది. 1962 వరకు ఫ్రెంచ్ ఆధీనంలో ఉన్న పుదుచ్చేరి 1963లో భారతదేశంలో విలీనమైంది. అప్పట్లో పుదుచ్చేరికి మాత్రం ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన శివప్రకాషం ఎంపీగా గెలిచారు.

11 సార్లు కాంగ్రెస్ విజయం ...

1967లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సేతురామన్ గెలుపొందారు. పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గానికి ఇప్పటివరకూ జరిగిన 15 లోక్‌సభ ఎన్నికల్లో 11 సార్లు కాంగ్రెస్ గెలిచింది. ఎన్ఆర్ కాంగ్రెస్, అన్నా డీఎంకే, డీఎంకే, పీఎంకే తలా ఒకసారి గెలిచాయి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన షణ్ముగం, ఫారూఖ్ తలా మూడుసార్లు ఎంపీగా గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున వైద్యలింగం, ఎన్ఆర్ కాంగ్రెస్ తరఫున డాక్టర్ నారాయణస్వామి పోటీపడ్డారు. ఆ ఎన్నికల్లో లక్షా 97 వేల 25 ఓట్ల మెజారిటీతో వైద్యలింగం గెలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎన్డీయే తరఫున బీజేపీ, ఇండియా కూటమి తరఫున కాంగ్రెస్, అన్నాడీఎంకే పార్టీ పోటీ చేస్తున్నాయి. బీజేపీ అభ్యర్థిగా రాష్ట్ర హోంశాఖ మంత్రి నమశ్శివాయం, కాంగ్రెస్ తరఫున సిట్టింగ్ ఎంపీ వైద్యలింగం, అన్నాడీఎంకే తరఫున తమిళ్‌వేందన్, నామ్‌తమిళర్ కట్చి తరఫున డాక్టర్ మేనక పోటీ చేస్తున్నారు. ఎన్డీయేకు (నమశ్శివాయంకు) మద్దతుగా 23 మంది శాసనసభ్యులు, రాజ్యసభ ఎంపీ, ముఖ్యమంత్రి రంగసామి ప్రచారం చేస్తున్నారు. ఇక ఇద్దరు కాంగ్రెస్ శాసనసభ్యులు, ఆరుగురు డీఎంకే సభ్యులు ఇండియా కూటమికి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. ఇటీవలే డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ పుదుచ్చేరిలో ప్రచారం చేశారు. సీపీఐ, సీపీఎం నేతలు కూడా వైద్యలింగంకు మద్దతుగా ప్రచారం చేశారు. ఇక శాసనసభలో ప్రాతినిధ్యం లేని అన్నాడీఎంకే ఒంటరిగా బరిలోకి దిగింది. అన్నాడీఎంకే కూటమి మిత్రపక్షాలైన డీఎండీకే, ఎస్డీపీఐ పార్టీలకు పుదుచ్చేరిలో ఎలాంటి పలుకుబడి లేదు. అయినా పుదుచ్చేరి అన్నాడీఎంకే అభ్యర్థి తమిళ్‌వేందన్‌కు మద్దతుగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఇటీవల చేసిన ప్రచారం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. అన్నాడీఎంకే రాష్ట్ర శాఖ కార్యదర్శి అన్బళగన్ కూడా ఇంటింటికీ వెళ్ళి ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఒంటరిగా పోటీ చేయడం వల్ల బీజేపీకి పడే ఓట్లు బాగా తగ్గే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. నామ్ తమిళర్ కట్చి ఈ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటు బ్యాంక్ ఉంది. ఈ పరిస్థితులలో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ కొనసాగుతోందని చెప్పవచ్చు. ఇక ఈ ఎన్నికల్లో పుదుచ్చేరికి రాష్ట్ర హోదా, మరిన్ని రేషన్‌షాపుల ఏర్పాటు, యువకులకు ఉపాధి అవకాశాల కల్పన వంటి ప్రధాన అంశాలపై బీజేపీ, కాంగ్రెస్, అన్నాడీఎంకే అభ్యర్థులు ప్రజలపై హామీల వర్షం కురిపిస్తున్నారు. ఇక ఇప్పటి వరకూ పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గంలో గెలువని బీజేపీని ఈ సారి ఎలాగైనా గెలిపించుకోవాలని ఎన్డీయే మిత్రపక్షాలన్నీ కలిసి సుడిగాలి ప్రచారాలు చేస్తున్నాయి. అదే సమయంలో 11 సార్లు గెలిచిన కాంగ్రెస్ మళ్ళీ గెలిచి పుదుచ్చేరి ఎప్పుడూ తమ పార్టీకి కంచుకోట అని నిరూపించే దిశగా విశ్వ ప్రయత్నం చేస్తోంది.


మంత్రి ఈవీ వేలు

ఎలాగైనా రెండో స్థానానికి

వచ్చేయండి ప్లీజ్!

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమిని చిత్తుగా ఓడించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పార్టీ ద్వితీయ స్థానానికి రాకుండా అడ్డుకోవాలని రాష్ట్ర మంత్రి ఈవీ వేలు అన్నాడీఎంకేకు పిలుపునిచ్చారు. తిరువణ్ణామలైలో డీఎంకే అభ్యర్థి అన్నాదురైకి మద్దతుగా ఆయన ప్రచారం చేస్తూ తిరువణ్ణామలై ఆలయాన్ని ఆధ్యాత్మిక క్షేత్రంగా మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధికి దక్కుతుందని, ప్రస్తుతం ఈ క్షేత్రాన్ని పర్యాటక శాఖకు అప్పగించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకేకు తానొక ముఖ్యమైన విజ్ఞప్తి చేస్తున్నానని, ఈ ఎన్నికల్లో బీజేపీకి ఎట్టి పరిస్థితులలోనూ రెండో స్థానం దక్కనీయకుండా అడ్డుకోవాలని, వీలైతే అన్నాడీఎంకే ద్వితీయ స్థానానికి రావడమే రాష్ట్రానికి మంచిదని మంత్రి ఈవీ వేలు చెప్పారు.

నేతల ప్రచారాల పర్యవేక్షణకు ఆధునిక వాహనం

ఐసిఎఫ్, ఏప్రిల్ 11: నేతల ప్రచార సభలు పర్యవేక్షించేలా ఆధునిక వాహనాన్ని ఏర్పాటుచేశారు. మెగా సిటీ పథకం కింద ఏడు ఆధునిక పర్యవేక్షణ వాహనాలను కొనుగోలు చేశారు. వాటికి నాలుగు వైపులా సీసీ కెమెరాలు అమర్చారు. రాజకీయ పార్టీల నాయకులు ప్రచారం చేపట్టే స్థలాల్లో ఈ వాహనాలను నిలిపి, వాటిలో ఉన్న డ్రోన్ ఎగురవేసి వీడియో ద్వారా ప్రచారం చిత్రీకరిస్తున్నారు.

రైల్వే గేట్ మూయకుండా అడ్డుకున్న మంత్రి అనుచరులు

ప్యారీస్, ఏప్రిల్ 11: మంత్రి గణేశన్ ప్రచార వాహనం వెళ్లే వరకు రైల్వే గేట్ మూయకుండా సిబ్బంది పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. విరుదాచలం సమీపంలో చోటుచేసుకున్న ఈ సంఘటన ఆందోళనకు దారితీసింది. కడలూరు లోక్‌సభ నియోజకవర్గం డీఎంకే కూటమి తరఫున పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డా.విష్ణుప్రసాద్‌కు మద్దతుగా మంత్రి గణేశన్ బుధవారం ప్రచారంలో పాల్గొన్నారు. ఓపెన్ టాప్ జీపులో విరుదాచలం-కాట్టుకూడలూరు రహదారిలో అభ్యర్థి విష్ణుప్రసాద్, మంత్రి గణేశన్, ఎమ్మెల్యే రాధాకృష్ణన్, వారి వెనుక 100కు పైగా వాహనాల్లో డీఎంకే, కూటమి పార్టీల నిర్వాహకులు, మరి కొంతమంది ద్విచక్రవాహనాల్లో ర్యాలీగా వెళ్లారు. ఉదయం 10.10 గంటలకు ఆ మార్గంలో కారైక్కాల్-బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ రైలుకు సిగ్నల్ ఇచ్చారు. అందువల్ల పది నిమిషాల ముందే చిన్నకండియకుప్పం ప్రాంతంలోని రైల్వే గేటును మూసివేసేందుకు సిబ్బంది ప్రయత్నించగా, వారిని మంత్రి అనుచరులు అడ్డుకున్నారు. మంత్రి కాన్వాయ్ రైలు గేటు దాటే వరకు గేటు మూసేందుకు రైల్వే సిబ్బంది పడరాని పాట్లు పడ్డారు. రైల్వే సిబ్బందితో మంత్రి అనుచరులు వాగ్వాదానికి దిగిన సమయంలో గేటు మూసివేశారు. దీంతో, ఎక్స్‌ప్రెస్ ఆ మార్గంలో ఎలాంటి ఆటంకం లేకుండా వెళ్లిపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

నటి రాధిక నోట తెలుగు పలుకులు

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సినీ నటి రాధిక ఓటర్లను ఆకట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. భర్త శరత్‌కుమార్‌ను వెంటబెట్టుకుని ఆమె ప్రచారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అయ్యనార్ నగర్, చంద్రగిరిపురం, సీనియాపురం తదితర ప్రాంతాల్లో తెలుగు ఓటర్లు అధికంగా ఉన్నట్లు తెలుసుకున్న రాధిక తెలుగులో ప్రచారంచేశారు. కేంద్రంలో పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం అవనీతి రహిత పాలన అందించినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రధాని మోదీ మూడోసారి గెలిచి కొత్తచరిత్ర సృష్టించనున్నారని తెలిపారు. ఆమెతోపాటు భర్త శరత్‌కుమార్ ప్రచారం చేసి తెలుగు ఓటర్లను బాగా ఆకట్టుకున్నారు.


విరుదునగర్ నియోజకవర్గం చంద్రగిరిపురంలో భర్త శరత్‌కుమార్‌తో కలిసి ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి, నటి రాధిక

అవినీతిపరులు మోదీ శిక్ష నుంచి తప్పించుకోలేరు!

సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి. సెల్వం


అభిమానుల పూలవర్షంలో ప్రచారం చేస్తున్న సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి. సెల్వం

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై ఐటీని ఉసిగొల్పి బెదరింపులకు పాల్పడుతోందంటూ చేస్తున్న ఆరోపణలలో పసలేదని, అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలుంటేనే ఐటీ దాడులు జరుగుతాయని సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం అన్నారు. శుక్రవారం ఉదయం ప్రచారానికి వెళ్లిన ఆయనకు కీల్పాక్ కుషాల్ గార్డెన్ తదితర ప్రాంతాల్లో స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఎన్డీయే మిత్రపక్షాలకు చెందిన కార్యకర్తలు 'తామర గుర్తుకు ఓటేద్దాం, సెంట్రల్ చెన్నైని అభివృద్ధి చేద్దాం' అంటూ నినాదాలు చేశారు. ప్రచార పర్యటనలో వినోజ్‌సెల్వం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐటీ అధికారులను ఉసిగొల్పి బెదిరిస్తోందంటూ డీపీఐ నాయకుడు తిరుమావళవన్ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడినవారే ఐటీ దాడులకు భయపడతారని, ఏ తప్పు చేయనివారు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రధాని మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చాక అవినీతిపరుల భరతం పడతారని ఆయన హెచ్చరించారు.


పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నమశ్శివాయంకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి


మదురై లోక్‌సభ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి వెంకటేశన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మదురై మేయర్ ఇంద్రాణి


చెన్నై నగరంలో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా 'కమలం' గుర్తుకు ఓట్లు వేయాలని కోరుతూ మోదీ మాస్క్‌తో ప్రచారం చేస్తున్న కార్యకర్త

రామనాథపురం నియోకవర్గంలో డీఎంకే కూటమిలో పోటీచేస్తున్న ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అభ్యర్థి నవాజ్ ఘనీకి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో



చెప్పులు కుట్టి, పండ్లమ్ముతూ కూల్ సురేష్ ప్రచారం

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై లోక్‌సభ నియోజకవర్గంలో ప్రముఖ హాస్యనటుడు కూల్‌సురేష్ రహదారి పక్కన చెప్పులు కుడుతూ, పండ్ల వ్యాపారం చేస్తూ వవిధ పద్ధతుల్లో బీజేపీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. సెంగం ప్రాంతానికి వ్యాన్‌లో వెళ్ళిన కూల్ సురేష్ రోడ్డు పక్కనే చెప్పులు కుడుతున్న కార్మికుడిని గమనించారు. వెంటనే వ్యాన్ నుండి దిగి ఆ కార్మికుడితో మాట్లాడుతూ తనూ చెప్పులు కుట్టాడు. అంతే కాకుండా జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఆ తర్వాత అక్కడికి కాస్త దూరంలో ఉన్న పండ్ల దుకాణానికి వెళ్లారు. తాజా పండ్లు వచ్చి త్వరగా కొనండి అంటూ కేకలు పెట్టి అందరినీ ఆకట్టుకున్నాడు.


చెప్పులు కుడుతున్న కూల్ సురేష్



సీమాన్ మైకు చిహ్నంలో తేడాలు

చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నామ్‌తమిళర్ కట్చి నాయకుడు సీమాన్ ఎన్నికల సంఘంపై మరోమారు విరుచుకుపడ్డారు. ఆ పార్టీ చిహ్నమైన చెరకు రైతు గుర్తును కర్ణాటకలోని ఓ పార్టీకి కేటాయించడంతో ఆ గుర్తు దక్కలేదని సీమాన్ ఇదివరకే కేంద్ర ఎన్నికల సంఘంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు మైకు చిహ్నం పొంది తీవ్రస్థాయిలో ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో ఈవీఎంలపై అతికించిన నామ్ తమిళర్ కట్చి గుర్తును చూసి సీమాన్ దిగ్భ్రాంతి చెందారు. ఎన్నికల సంఘం తనకు కేటాయించిన చిహ్నానికి, ఈవీఎంలపై అతికించిన గుర్తుకు తేడాలున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల అధికారులు స్విచ్ లేని మైకు తన పార్టీ గుర్తుగా ఎంపిక చేశారని, అయితే ప్రస్తుతం ఈవీఎంలపై స్విచ్ ఉన్న మైక్‌ను అతికించి ఉన్నారని, దీనితో తన పార్టీకి ఓటేయదలచినవారు అయోమయానికి గురవుతారని సీమాన్ పేర్కొన్నారు. ఈ విషయమై కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

సాయి తనిష్క ప్రధాన పాత్రలో 'ది ప్రూఫ్'

యువ హీరోయిన్ సాయి తనిష్క ప్రధాన పాత్రలో 'ది ప్రూఫ్' పేరుతో చిత్రం తెరకెక్కుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సీనియర్ హీరో శశికుమార్ రిలీజ్ చేశారు. గోల్డెన్ స్టూడియో బ్యానరుపై గోమతి సత్య నిర్మించారు. నృత్య దర్శకురాలు రాధిక మాస్టర్ ఈ చిత్రానికి దర్శకత్వం చేశారు. 2006లో వచ్చిన 'తిరుడి' చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన సాయి తనిష్క.. 2009లో జయం రవి హీరోగా నటించిన 'పేరణ్మై' చిత్రంలోనూ నటించారు. ఈ రెండు చిత్రాల్లో తన నటనతో ప్రేక్షకుల మనసుల్లో చెరగనిముద్ర వేసుకున్నారు. ఆ తర్వాత 'మంజావేలు', 'నిల్ గవని చెల్లాదే', 'అరవాన్', 'పరదేశి' వంటి అనేక చిత్రాల్లో నటించారు. 2016లో పా.రంజిత్ దర్శకత్వంలో వచ్చిన 'కబాలి' చిత్రంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తెగా నటించారు. ఆ తర్వాత దుల్కర్ సల్మాన్‌లో కలిసి 'సోలో' మూవీలో నటించారు. ఇపుడు ఆమె ప్రధాన పాత్రలో 'ది ప్రూఫ్'లో నటించారు.


సాయి తనిష్క

హీరోగా నగేష్ మనవడు బిజేష్

సీనియర్ హాస్య నటుడు దివంగత నగేష్ మనవడు, ఆనంద్ బాబు పెద్ద కుమారుడు బిజేష్ హీరోగా వెండి తెరకు పరిచయమయ్యారు. అతను ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న చిత్రం 'వానరన్'. శ్రీరామ్ పద్మనాభన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఆరెంజ్ పిక్చర్స్ పతాకంపై రాజేష్ పద్మనాభన్ నిర్మిస్తున్నారు. దీపా శంకర్, అక్షయ హీరోయిన్లుగా నటించగా, లొల్లు సభ జీవా, ఆదేశ్ బాలా, నాంజిల్ విజయన్, ఎస్ఎల్.బాలాజీ, బేబీ వర్ష, వెంకట్‌రాజ్, శివగురు, రాంరాజ్, నామక్కల్ విజయకాంత్ తదితరులు ఇతర పాత్రలను పోషించారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'హీరో బిజేష్ పాత్రను చాలా రియలిస్టిక్‌గా చిత్రీకరించాం. తమిళ చిత్రపరిశ్రమలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంటుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అలాగే హీరోయిన్ అక్షయ డ్యాన్స్ ఆర్టిస్ట్‌గా చాలా సహజసిద్ధమైన పాత్ర పోషించారు. క్యారెక్టర్ రోల్‌లో ఆదేశ్ బాలా, బేబీ వర్ష నటించారు. చెన్నై, తదితర ప్రాంతాల్లో మొత్తం సినిమాను 30 రోజుల్లో ఒకే షెడ్యూల్‌లో ముగించామని, ఇప్పటికే ఫస్ట్‌లుక్ రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది. ఒక మంచి కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం' అన్నారు.


'వానరన్'లో బిజేష్ నగేష్ - అక్షయ

చిత్రజ్యోతి

'చెన్నై స్టోరీ' నుంచి తప్పుకున్న శృతిహాసన్

హాలీవుడ్ దర్శకుడు ఫిలిప్ జాన్ దర్శకత్వంలో 'చెన్నై స్టోరీ' పేరుతో తెరకెక్కే ప్రాజెక్టు నుంచి హీరోయిన్ శృతిహాసన్ తప్పుకుంది. 'అరేంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' అనే ఆంగ్ల నవల ఆధారంగా రొమాంటిక్ ఆఫ్ కామెడీ జానర్‌లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవ వేడుక ఇటీవల నగరంలో జరిగింది. ఇందులో ముందుగా సమంతను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. కానీ, ఆమె అనారోగ్యం కారణంగా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత సమంత స్థానంలో శృతిహాసన్‌ను ఎంపిక చేసి, అను అనే డిటెక్టివ్ పాత్రకు స్క్రీన్‌ప్లే చేశారు. అయితే, శృతిహాసన్ కూడా హఠాత్తుగా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకున్నారు. కారణాలు మాత్రం ఆమె బహిర్గతం చేయలేదు.





మూడు హిట్ చిత్రాల సీక్వెల్స్‌లో కార్తీ

సీనియర్ నటుడు శివకుమార్ తనయుడిగా, హీరో సూర్య తమ్ముడిగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన హీరో కార్తీ ఇపుడు ఓ స్టార్ హీరోగా ఎదిగారు. తనకుంటూ ప్రత్యేక ఇమేజ్‌తో పాటు మార్కెట్ సంపాదించుకుని, వరుస చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన నటించి, సూపర్ హిట్ అయిన మూడు చిత్రాల సీక్వెల్స్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'ఖైదీ', హెచ్.వినోద్ తెరకెక్కించిన 'ధీరన్ అధికారం ఒండ్రు', పీఎస్ మిత్రన్ డైరెక్ట్ చేసిన 'సర్దార్' సీక్వెల్స్‌లో నటించనున్నారు. వీటిలో మొదటగా 'సర్దార్' రెండో భాగాన్ని జూన్ నుంచి చిత్రీకరించనున్నారు. ఇప్పటివరకు కార్తీ నటించిన చిత్రాల్లో కెల్లా 'సర్దార్' మూవీ అత్యధిక కలెక్షన్లు రాబట్టిన విషయం తెల్సిందే. ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేశారు. ఒకటి పోలీస్ ఆఫీసర్‌గా, రెండోది మాజీ రా అధికారిగా నటించారు. ఇదిలావుండగా ప్రస్తుతం కార్తీ 'జపాన్' చిత్రం వంటి డిజాస్టర్ మూవీ తర్వాత '96' ఫేం ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో 'మెయ్యళగన్', నలన్ కుమారస్వామి డైరెక్షన్‌లో 'వా వాత్తియారే' మూవీల్లో నటించగా, ఈ రెండు చివరి దశ చిత్రీకరణ పనులు జరుపుకుంటున్నాయి.